క్లుప్తంగా

నాటు నాటుతో అలరించిన విద్యార్థులు



చిందులు వేస్తున్న విద్యార్థులు

ఆదోనిఅర్బన్: ఆస్కార్ అవార్డు సొంతం చేసుకున్న నాటు నాటు పాటకు ఆదోని పట్టణంలోని కిడ్డీస్ పాఠశాల విద్యార్థులు చిందులు వేసి అలరించారు. స్థానిక చేకూరి ఫంక్షన్ హాలులో ఆ పాఠశాల డైరెక్టర్ కేశవ నారాయణరెడ్డి, చెన్నపు రెడ్డి ఆధ్వర్యంలో 'అమ్మానాన్నకు ప్రేమతో రూట్ తరంగ్' కార్యక్రమం జరిగింది. చిన్నారులు స్వాతంత్య్ర సమరయోధులు, ఆయా రాష్ట్రాల నృత్య కళాకారుల వేషధారణలో అలరించారు. పాఠశాలలో 2021–22 సంవత్సరం పదో తరగతిలో 600కు 590 మార్కులు సాధించిన విద్యార్థి జాషువా, తల్లిదండ్రులకు రూ.50 వేల చెక్కును డైరెక్టర్లు అందజేశారు.

హెబ్బటంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

ఆదోనిరూరల్: ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సామాజిక స్పృహను అలవర్చుకోవాలని పర్యావరణం గురించి తెలుసుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.బాలాజీ, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆదోని–ఆలూరు రహదారిలోని బీమా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కాలేజీ తరపున విద్యార్థులతో కలిసి హెబ్బటం గ్రామంలో ప్రత్యేక శిబిరం సోమవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మొదటిరోజు ప్రత్యేక శిబిరాన్ని హెబ్బటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం రంగప్ప పాల్గొని మాట్లాడారు. పర్యావరణం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ.. శిబిరం ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ కార్యక్రమాల షెడ్యూల్‌ను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాధ్యతగా మెలగాలని సూచించారు.

ఛలో ఢిల్లీని జయప్రదం చేయండి



కరపత్రాలను పంచుతున్న సీఐటీయూ నాయకులు

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టే ఛలో ఢిల్లీ – పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఈరన్న, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న కోరారు. ఈ మేరకు సోమవారం ఆదోని పట్టణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మిక, కర్షక హక్కులకై ఢిల్లీలో చేపట్టే ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు శాంతి ర్యాలీ

ఆదోని అర్బన్: పట్టణంలోని సియోనో ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మంగళవారం క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ ప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని, మున్ముందు ఇలాంటి దాడులు పునరావృతంగాకుండా ఉండేందుకు శాంతి ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. ర్యాలీ పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోని సాయి కళాశాల ఎదురుగా ఉన్న సియోనో ప్రార్థనా మందిరం నుంచి ప్రధాన రహదారులైన ఎమ్మిగనూరు సర్కిల్ మీదుగా కోట్ల కూడలి, పాత బస్టాండు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వరకు కొనసాగుతుందన్నారు. తిరిగి సియోనో ప్రార్థనా మందిరం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగబోయే శాంతి ర్యాలీలో ఆయా ప్రార్థనా మందిరాల ఫాస్టర్లు, క్రైస్తవులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా చింతొవయ్య జాతర



స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామంలో కొండపై వెలసిన చింతొవయ్య (అంజనేయ స్వామి) జాతర ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ప్రతి ఎడాదిలాగే ఈ సంవత్సరం కూడా స్వామి వారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం స్వామి వారి రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల నుంచి ఆలయం వరకు విద్యుదీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రాచీన నృత్యాలు, కోలాటం, పరుగుపందెం, ఇసుక బస్తాలు ఎత్తడం వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీధి కుక్కల సమస్యకు చెక్

- సంతతి నియంత్రణకు అధికారుల చర్యలు
- శస్త్రచికిత్స తర్వాత యాంటీవైరస్ ఇంజెక్షన్లు



ఆదోనిలో వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

ఆదోని టౌన్: వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల దాడిలో గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుక్కలబారి నుంచి పిల్లలు, ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఆదోని మున్సిపాలిటీలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. 42 వార్డుల పరిధిలో వీధికుక్కలు ఏయే ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయో గుర్తిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని కుక్కలను పట్టి సంతతి నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. గతంలో ఆపరేషన్లు చేసిన కుక్కలు పొరపాటునా ఎవరినైనా కరిచినా ఎలాంటి ప్రమాదం లేకుండా అప్పట్లో యాంటీవైరస్ సూదులు వేశారు.

ప్రస్తుతం మున్సిపాలిటీలో వీధి కుక్కలను పట్టుకుని సంతతి నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తిరుపతికి చెందిన ఏజెన్సీకి కాంట్రాక్టు అప్పగించారు. ఆపరేషన్లు చేసిన కుక్కలకు యాంటీవైరస్ టీకా వేసి వదిలిపెడతారు. పట్టణంలో 42 వార్డుల పరిధిలో వీధికుక్కలు, పెంపుడు కుక్కలు దాదాపు 3 వేల దాకా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది వెయ్యి వీధి కుక్కలకు సంతతి కలగకుండా ఆపరేషన్లు చేశారు. అయితే ప్రస్తుతం కుక్కల బెడదపై ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో కుక్కలను పట్టి ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆపరేషన్ల ద్వారానే కుక్కల సంతతి నియంత్రణ సాధ్యమని, వాటివల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

వైద్యాధికారుల బృందం సిద్ధం

కుక్కలకు సంతతి నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు పశువైద్యాధికారులతో కూడిన వైద్య బృందాన్ని సిద్ధం చేశారు. ముగ్గురు వైద్యాధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో మిగిలిన 2 వేలకు పైగా కుక్కలకు త్వరలోనే ఆపరేషన్లు చేసియాంటీవైరస్ టీకా వేసి వదిలేందుకు చర్యలు తీసుకున్నారు.



కుక్కకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

చికెన్, మటన్ వ్యాపార దుకాణాల వద్దనే కుక్కలు

పట్టణంలోని చికెన్, మటన్, చేపలు మార్కెట్ల వద్ద కుక్కలు అధికంగా ఉంటున్నాయి. అక్కడే పడిగాపులు కాస్తూ వ్యాపారులు పారవేసిన వ్యర్థాలను తింటూ జీవనం గడపుతున్నాయి. బార్లు, డాబాల వద్ద కూడా కుక్కలు ఎక్కువగా ఉంటున్నాయి. సంతతిని పెంచుకుంటున్నాయి. మాంసాహారానికి అలవాటుపడిన కుక్కలు రోడ్లపైన, వీధుల్లోనూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, ఇతర జీవాలపై దాడికి దిగుతున్నాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. మాంసం వ్యాపారులు వ్యర్థాలను అక్కడే పారేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేసి కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు సహకరించాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆడ కుక్కల ఆపరేషన్లకు ఇబ్బంది



పట్టణంలో కొన్ని వార్డుల పరిధిలో ఆడ కుక్కలు ఎక్కువగా కడుపుతో ఉన్నట్లు శానిటరీ సెక్షన్, వార్డు సచివాలయాల అధికారులు చేసిన సర్వేలో తేలింది. కుక్కల సంతతి నియంత్రణ కోసం మగ కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నాం. అయితే ఆడ కుక్కలు ఈనేంత వరకు ఆపరేషన్లు చేయలేం. ఆపరేషన్ చేసిన తర్వాత కుక్కలు ఎవరినైనా కరిచినా ప్రమాదం లేకుండా యాంటీవైరస్ మందును ఇంజెక్షన్ రూపంలో వేసి తర్వాత వీధుల్లోకి వదులుతున్నాం.

– రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి



చిన్నమార్కెట్ ఏరియాకు వెళ్లాలంటే కుక్కల బెడద ఎక్కువగా ఉంది. మాంసం వ్యాపారులు పారవేసిన వ్యర్థాలను తింటూ కుక్కలు అక్కడే ఉంటున్నాయి. చిన్నపిల్లలు, ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వీధి కుక్కల సమస్య పరిష్కరించాలి.

– భాగమ్మ, సాయిబాబానగర్, ఆదోని

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి ని దర్శించుకుని పూజ లునిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం,ప్రత్యేకపూజలునిర్వహించి ఫలపు ష్పా లతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. పి ండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

వివాహిత ఆత్మహత్య

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో సోమవారం పూర్ణిమ (37) అనే వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త మల్లయ్య తెలిపారు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదోనికి డాక్టర్ వద్దకు చూపించుకోవడానికి వెళ్లగా తిరిగి వచ్చేలోపు భార్య మృతి చెందినట్లు తెలిపారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. పూర్ణిమకు ఒక కుమారుడు ఉన్నాడు.

'స్పందన'తో సమస్యల పరిష్కారం



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కల్లుబావి ప్రజలు

ఆదోని టౌన్ : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్పందనలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాల్మీకినగర్‌కు చెందిన రామతులసి ప్లాట్లు సర్వే చేసి లబ్ధిదారులకు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. సాయినగర్‌కు చెందిన గోపాల్ ఇంటి పన్ను, కుళాయి పన్ను విధించాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని కమిషనర్‌కు వినతి సమర్పించారు. గాళీపేటకు చెందిన వెన్నెల విజయ్ తన స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు మున్సిపాలిటీ అధికారులు అనుమతి, ఇంటి ముందున్న ఆక్రమిత స్థలం వివాదం పరిష్కరించాలని కోరారు. హనుమాన్‌నగర్‌కు చెందిన శకుంతల ఆస్తి పన్ను విధించాలని దరఖాస్తు చేసుకున్నారు. పన్ను కడతామన్నా అధికారులు కట్టించుకోకపోవడం విచారకరమంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్దిష్ట వేళకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరగడంలేదని, ప్రజల సౌకర్యం మేరకు నీటిని విడుదల చేయాలని కొందరు దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కార్వన్‌పేట, గాలీపేట, ఆర్టీసీ కాలనీలకు చెందిన ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



ఎన్.భానుమతి | వై.వైష్ణవి | ఎం.కీర్తి | భార్గవి | సుధీర్

మంత్రాలయం రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదుగురు ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హంపయ్య తెలిపారు. ఫిబ్రవరి నెలలో ఆదోనిలో జరిగిన స్కాలర్ షిప్ పరీక్షల్లో 4 వేల మంది హాజరు కాగా అందులో 269 స్కాలర్‌షిప్‌లకు అర్హత పొందారు. వీరిలో ఎన్.భానుమతి 119, వై.వైష్ణవి 102, ఎం.కీర్తి 97, కె.భార్గవి 95, ఎస్.సుధీర్ 85 మార్కులతో సత్తా చాటారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించిన ఉరుకుంద, ప్రసన్న కుమారి ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

కుక్కల దాడిలో 17 జీవాలు మృతి



మృతి చెందిన గొర్రెపిల్లలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వీధికుక్కల దాడిలో 17 గొర్రెపిల్లలు మృతి చెందాయి. బాధితుడు కురువ లింగన్న తెలిపిన వివరాల మేరకు.. తన పశువుల కొట్టంలో రోజూ మాదిరిగానే గొర్రె పిల్లలను ఉంచి మిగతా జీవాలను మేపేందుకు వెళ్లగా గ్రామంలోని వీధి కుక్కలు దాడి చేసి చంపాయని లింగన్న వాపోయాడు. సాయంత్రం ఆటుగా వెళ్లిన గ్రామస్తులు కుక్కల దాడిలో గాయపడిన గొర్రె పిల్లలను కాపాండేందుకు ప్రయత్నించారు. అప్పటికే 17 గొర్రెపిల్లలు చనిపోయాయని రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు లింగన్న ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే పక్కనే ఉన్న కోళ్లపై దాడి చేయడంతో 18 కోళ్లు చనిపోయినట్లు తెలిపాడు. తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

వేడుకగా పల్లకీ మహోత్సవం



ఎనిమిది పల్లకిలతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో సోమవారం భీమలింగేశ్వరస్వామి దేవర పల్లకీ మహోత్సవం వేడుకగా జరిగింది. ఆదివారం రాత్రి ఏటి నీటి కోసం నందవరం మండలం గురుజాలకు వెళ్లి అక్కడి రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ఏటి నీటితో సోమవారం గ్రామానికి చేరుకున్నారు. ఉత్సవంలో గార్లదిన్నె, చిన్నమర్రివీడు, గొల్లలదొడ్డి, గాజులదిన్నె, పెద్దమర్రివీడు, చిన్నకొత్తిలి, అల్వాల, కులమాల గ్రామాల పల్లకిలతో భక్తులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు స్వామివారి దేవర మహోత్సవాలు జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కాగలరని గ్రామ పెద్దలు కోరారు.

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ

కౌతాళం:పాడిపశువులకు టీకా వేయించడం ద్వారా గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని మండల పశువైద్యాధికారి జగదీష్‌బాబు అన్నారు. నదిచాగి గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి వల్ల మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, పశుపోషకులు వ్యాధి లక్షణాలను గుర్తించి వెంటనే పశువైద్య కేంద్రాలలో టీకాల్ని వేయించి చికిత్స అందించాలన్నారు. పశువులలో తీవ్రమైన జ్వరం, కొద్ది పాటి ఎండకే పశువులు నీరసించిపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు గాలికుంట వ్యాధిలో ఉంటాయన్నారు. ఈ సీజన్‌లో గాలి జ్వరం సోకే అవకాశం ఎక్కువ ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలో భాగంగా గ్రామంలో 350 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు ఆయన తెలిపారు. రెండు, మూడురోజులకోసారి వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని పశువుల యజమానులు ఉపయోగించుకోవాలని కోరారు. ఎంపీటీసీ లింగన్నగౌడు, వెటర్నిటీ గ్రామ అసిస్టెంట్ రహీం, తదితరులు పాల్గొన్నారు.





పెద్దకడబూరులో అక్కాచెల్లెమ్మలకు మెగా చెక్ అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి, హాజరైన మహిళలు

అక్కా చెల్లెమ్మలకు 'ఆసరా'

పెద్దకడబూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్కాచెల్లెమ్మలకు ఆసరాగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. పెద్దకడబూరులోని వెలుగు కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి అతిథులుగా వై.ప్రదీప్ రెడ్డి, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్‌పర్సన్ భాగ్యమ్మ, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా పథకం మూడవ విడతలో భాగంగా మండలంలో 685 పొదుపు సంఘాల్లోని 6,566 మంది సభ్యులకు రూ.2.67 కోట్లు వారి బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా నగదు విడుదల చేసి రాష్ట్రంలోని మహిళలకు తాను ఎప్పటికీ అండగా ఉంటానని జగనన్న మరోసారి రుజువు చేశాడని వివరించారు. నవరత్నాల పథకాలతో మహిళల సంక్షేమానికి బాటలు పరిచిన జగనన్నకు తోడుగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే అక్కచెల్లెమ్మలకు సంక్షేమ పథకాలు అందుతాయని, వేరే ప్రభుత్వం వస్తే ఈ పథకాలన్నీ ఆవిరైపోతాయన్నారు. అనంతరం అక్కాచెల్లెమ్మలకు ఆసరా మెగా చెక్‌ను అందజేశారు. మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, ముక్కరన్న, పరమేష్, ఎంపీడీఓ వెంకటరమణ, డీటీ మహేష్, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



స్పందన కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. డివిజన్‌లో ఇప్పటివరకు రీసర్వే ఎనిమిది మండలాల్లో 58 గ్రామాల్లో 1,13,253 ఎకరాలు పూర్తి చేశామన్నారు. రీసర్వేలో ఏదైనా సమస్య వస్తే సంవత్సరంలోపు ఆ మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్ లేదా రీసర్వే ఉప తహసీల్దార్ అప్పీల్స్ చేసుకోవచ్చన్నారు.

స్పందనకు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- ఆదోని మండలం పెద్దతుంబళంలో వెలుగు సీసీ రామన్న, బుక్‌కీపర్లు ఏకమై పొదుపు మహిళలు కట్టిన నెలవారీ కంతు డబ్బులు బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేశారని గ్రామానికి చెందిన సిద్దప్ప, రేణుక, మదర్‌థెరిస్సా గ్రూపు సభ్యులు, గ్రామ నాయకులు నరసయ్య సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.
- పట్టణంలో విద్యుత్ ఓల్టేజ్ హెచ్చుతగ్గుల వల్ల ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు పాడవుతున్నాయని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదోని పట్టణం మహాత్మాగాంధీనగర్‌లోని 21వ వార్డుకు చెందిన సూరుపోగు ప్రమోద్‌కుమార్ అర్జీ సమర్పించారు.
- గోనెగొండ్ల మండలం తిప్పనూరుకు చెందిన బోయ మహేష్, రామకృష్ణ, పులిరాజుకు సంబంధించి సర్వే నంబర్ 63లో 3.25 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించిందని, దీన్ని కొందరు ఆక్రమించుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చారు.
- రెండు గ్రామాల మధ్య పొలాలకు సంబంధించి రస్తా సమస్య పరిష్కరించాలని హొళగుంద మండలం చిన్నహ్యాట, పెద్దహ్యాట గ్రామాలకు చెందిన మల్లయ్య, ఈరన్న కోరారు.
- ఆదోని మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన సిరాజ్అహ్మద్ అర్జీ సమర్పిస్తూ సర్వేనంబర్ 62బీ డంపింగ్ యార్డు సమీపంలో పొలంలో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయని, వాటిని సరి చేయాలని అర్జీ ఇచ్చారు.

కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ సహాయకులు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై ఫిర్యాదు

పెద్దకడబూరు: రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ శ్మశాన భూమి కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ సిబ్బంది కళ్లప్పగించి చూస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ఆర్టీఐ యాక్ట్ విభాగం రెప్రజెంటేటివ్ బొగ్గుల తిక్కన్న ఆరోపించారు. సోమవారం ఆదోనిలో స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పెద్దకడబూరులో 265/ఏ3లో 3.3 ఎకరాల శ్మశాన భూమి కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నకిలీ పట్టాలు పొందిన వారికి నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకోవడంతో పాటు పట్టాలు ఇచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ త్వరలోనే ఫీల్డ్ విజిట్ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ



పత్తికొండలో కూల్‌డ్రింక్స్ షాపులో తనిఖీ చేస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: పత్తికొండ పబ్లిక్ రీడింగ్ రూం షాపింగ్ కాంప్లెక్స్‌లోని గౌస్ కూల్‌డ్రింక్ షాపులో సోమవారం అసిస్టెంట్ ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ కూర్మానాయక్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆదివారం పత్తికొండ సీఐ మురళీమోహన్ ఆ షాప్‌లో కూల్‌డ్రింక్ తాగగా బాటిల్‌పై గడువు తేదీ ముగిసి ఉండడం గమనించారు. అనుమానం వచ్చి షాపులోని కూల్‌డ్రింక్స్‌ను పరిశీలించగా అన్నీ కాలం చెల్లినవే ఉండడం గుర్తించి ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సోమవారం తనిఖీ చేపట్టారు. కూల్‌డ్రింక్స్ బాటిళ్లపై ఉన్న గడువు తేదీని పెన్నుతో చెరిపేసి, బ్లేడుతో తొలగించి మరీ విక్రయాలు చేపట్టినట్లు విచారణలో బయటపడింది. ఉద్దేశపూర్వకంగానే షాపు యజమాని గౌలిసుబాన్ కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్‌ను ప్రజలకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. పూర్తి నివేదికను కర్నూలు కోర్టుకు సమర్పిస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.